# ఇన్లాండ్ లెటర్ కథలు

## తొలిముద్దు



క్లాస్‌లోకి అడుగుపెట్టిన శరణ్మయి తన బెంచ్‌వద్ద ఏదో చీటీ వుండటం గమనించి విప్పిచూడగానే "శరణ్... నీ తొలిముద్దు నాదే! పందెం" అని ఉంది. ఒక్కసారిగా శరణ్మయి ముఖం కోపంతో ఎర్రబడిపోయింది. సాయంకాలం కాలేజ్ అయ్యేంతవరకూ అదే ఆలోచనతో బుర్ర వేడెక్కిపోయింది. ఇంటికి వచ్చి తన రూంలోకి వెళ్లగానే తన బుక్స్ టేబుల్‌మీద తన అడ్రస్‌తో పోస్ట్ చేసివున్న కవర్ విప్పి చూడగా మళ్లీ "శరణ్...నీ తొలిముద్దు నాదే పందెం" ఈసారి లెటర్‌ను ముక్కలు చేసేసింది. ఈ లెటర్ ఇంట్లో వాళ్లు చదవనందున ఆ దేవుడికి మనస్సులో వేయి దండాలు పెట్టింది.

శరణ్మచికి అదే దస్తూరితో లెటర్స్ రావడం, ఫోన్ కాల్స్ రావడం - పెద్ద ప్రాబ్లం అయిపోయింది. ఇంట్లో చెబితే ఇంత చిన్న విషయాన్ని రాద్ధాంతం చేస్తారు. తనదే ఏదో తప్పంటూ కాలేజ్ మాన్పించేస్తారు. అందుకే చెప్పలేదు.


శరణ్మయిని చూడడానికి పెళ్లివాళ్లు వస్తున్నారనగానే ఒక ప్రక్కన సంతోషం, మరోప్రక్కన లెటర్స్ గూర్చి భయం. పెళ్లికొడుకు రేవంత్ పెద్దలతో రావడం...పిల్ల నచ్చడం...ముహూర్తాలు పెట్టించి పెళ్లి జరిగిపోవడం టకా టకా జరిగిపోయాయి.

పెళ్లిశోభనం మొదటిరాత్రి నాడు ఫ్రెండ్స్ అంతా ముస్తాబు చేస్తున్నప్పుడు ఫోన్ వచ్చిందని వాళ్ల అన్నయ్య చెప్పగా శరణ్మయి ఫోన్ ఎత్తగానే "శరణ్...నీ పెదవులకు లిప్‌స్టిక్ చాలా బావుంది. నీ తొలిముద్దు నాదే!" మళ్లీ అదే కంఠం. శరణ్మయి హృదయం అవమానంతో కుచించుకుపోయింది. స్నేహితులు, ముత్తయిదువలు తనకు పాల గ్లాసిచ్చి గదిలోకి పంపగానే తన భర్త రేవంత్ తనని మల్లెలలతో అలంకరించిన పందిరిమంచంపై కూర్చోబెట్టి అతని అమృతహస్తాలతో తన ముఖారవిందాన్ని దగ్గరకు తీసికొని తన కెంపు ఛాయల చెంపలమీద అతని నామాగు మీసాల చాటున వున్న ఎర్రని పెదవులతో తొలిముద్దు ముద్రించగానే తను తన్మయత్వంతో ఊగిపోతూ "రాస్కెల్... ఓడిపోయాడు..."అంటూ యథాలాపంగా ఆమె నోటినుంచి వచ్చిన మాటలు విని రేవంత్ విషయం అడగ్గానే, తనకొచ్చిన లెటర్స్, ఫోన్స్ విషయాలన్నీ చెబుతుండగా రేవంత్ బిగ్గరగా నవ్వుతూ "ఓడిపోయింది నువ్వే శరణ్, అతను నీ బుగ్గలమీద ముద్దుపెట్టి గెలిచాడు" అనగానే "వ్వాట్" అంటూ శరణ్మయి ఉలిక్కిపడింది.

"ఆ అజ్ఞాత ప్రేమికున్ని నేనే శరణ్, నా కాబోయే భార్య గతంలో జరిగిన విషయాలు నాతో పెళ్లి అయ్యాక చెబుతుందా, లేదా అని పరీక్ష పెట్టాను. ఏదీ దాచకుండా చెప్పావు. నేను అదృష్టవంతున్ని. కాని నిన్ను బాధ పెట్టాను క్షమించు" అని రేవంత్ అంటుండగానే అతని ముఖాన్ని ఒక్కసారిగా ముద్దులతో ముంచెత్తుతూ శరణ్మయి అతన్ని పెనవేసుకోగానే వాళ్ల పక్కమీద పరచివున్న మల్లెపూలు దుప్పటి మీద "తొలిముద్దు" ముద్రించి నిద్రలోకి జారుకున్నాయి.

బావన దశావతారం

యర్రపోతవరం(తూ.గో.)



## అమ్మా-మమ్మీ

ప్రీతి మధ్యతరగతి కుటుంబానికి చెందిన గృహిణి. ఆమెకు ఇద్దరు కుమారులు. సునిల్, అనిల్. సంవత్సరం క్రితం ఆమె భర్త యాక్సిడెంట్‌లో మరణించాడు. అందుచే కుటుంబం బాధ్యత ఆమెదే. ప్రీతి తన పెద్దకుమారుడు సునీల్‌ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. సునీల్‌కు అమ్మంటే ఎనలేని ప్రేమ. ఎప్పుడూ అమ్మా! అమ్మా! అంటూ కొంగుపట్టుకుని తిరుగుతుంటాడు. అమ్మకు చిన్న చిన్న పనులలో సహాయపడి చాలా చక్కగా చదువుకుంటున్నాడు. అయితే ప్రీతి చిన్న కుమారుడు అనిల్‌ను ఇంగ్లీష్ చదువుల మీద వుండే మోజులో పట్నంలో ఒక ఇంగ్లీష్ మీడియం పాఠశాలలోని హాస్టల్‌లో వుంచి చదివిస్తున్నది. నెలకోసారి పట్నం వెళ్లి ప్రీతి అనిల్‌ను చూసి వస్తుండేది. సెలవులలో అనిల్ ఇంటికి వచ్చినప్పుడు మమ్మీ! మమ్మీ! అని పదే పదే పిలిపించుకుని, తన కుమారుడు ఎంత చక్కగా ఇంగ్లీష్ మాట్లాడుతున్నాడే చూడండని గర్వంగా చెప్పకునేది. కాలగమనంలో ఇరవై సంవత్సరాలు గడచిపోయాయి. అనిల్ చదువుకోసం ఆమె ఎన్నో అప్పులు చేసింది. అనిల్‌కు ఏదైనా ఉద్యోగం వచ్చిన తరువాత ఆ అప్పలన్నీ తీరుస్తాడనే ఆశతో. కానీ పట్నంలో ఇంజనీరుగా పనిచేస్తూ ఒక అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుని తల్లిని గూర్చి ఏమి పట్టించుకోలేదు. కనీసము తల్లి అనారోగ్యముగా ఉన్నదని తెలిసినా చూడటానికి కూడా రాలేదు. అనిల్‌మీద ఆమెకు ఉన్న ఆశలన్నీ అడియాసలైనాయి. పెద్దకుమారుడు సునిల్ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా ఉద్యోగం సంపాదించుకుని, తల్లి చేసిన అప్పలు తీరుస్తూ ఆమెను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు. సునీల్ చేస్తున్న సేవలకు ఆ తల్లి మనస్సులో ఏదో తెలియని కలత ఆమె మనస్సును ప్రశ్నించసాగింది. నీవు అమ్మగా ధన్యమైనావా? మమ్మీగా ధన్యమైనావా? నీవు అమ్మవా...మమ్మీవా...అని తనను తానే ప్రశ్నించుకుంది ప్రీతి.

కొప్పినేని నాగేశ్వరరావు

పాలకొల్లు(ప.గో.)